# నిత్యశిశిరం

నాయని హేమలతాదేవి



మాటలెంత మృదువులో మనస్సంత కఠినం. మనస్సెంత వెన్నపూసో మాటలంతటి ఈటె పోట్లు. ఇవి వారిద్దరి స్వభావాలూను. వారు ఎవరికెవరో అయితే బాదేలేదు. బ్రతికినంతకాలం ఒకరికొకరు బ్రతకవలిసిన భార్యాభర్తలుగా వారిని ఒకటి చెయ్యడంలో విధాతకేమి ఆనందం కలిగిందో మరి.

హనీమూన్‌కి వెళ్లాలనే ఆకాశహర్మ్యాల్లాంటి కోరికలు, అస్తమానం అతనిలో కరిగిపోతూండాలనే అస్తవ్యస్తపు ఆలోచనలు అణుమాత్రంకూడా లేవు రాధకు. ఉన్నదల్లా ప్రతి విషయాన్నీ మనసు విప్పి ఒకరికొకరు చెప్పుకోవాలనీ, ఏది చేసినా ఒకరి అభిప్రాయాన్ని ఒకరు మన్నించుకోవాలనీ అభిలషించే మనస్తత్వమే. అందుకు పూర్తిగా వేరు భాస్కరం. తనలోని బడబాగ్నిని తానే భరించాలి. దానివల్ల కలిగే మంచిచెడుగులకు తను మాత్రమే బాధ్యుడుగా ఉండాలి, తనకు నచ్చినరీతిని తనేదైనా చెయ్యాలనే భాస్కరం రాధకు అర్థంకాకపోవడంలో వింతేముంది? అతి సున్నితమైన రాధమనస్సు మాటిమాటికీ ముక్కలయ్యేది భాస్కరం ప్రవర్తనవల్ల. తృటిలో దృగ్గోళాలు నిండిపోయేవి. ఆడదాని కన్నీటికి కరగని మగవాడుండడని లోకోక్తి. కాని కరుడుగట్టినవాడిలా "మాటకుముందు ఏడిచే ఆడదాన్ని అసలు

సమ్మకూడదు!'' అంటూ విదిలించేసే భాస్కరం ముందు రాధ కరువుతీరా ఏడవడానికి కూడా నోచుకో లేదు. ఆ కన్నీళ్ళు గడ్డకట్టి ఆఖరికావెను కూడా కఠినురాలుగా మార్చేశాయి. ప్రతి మాటా ఒక ఈటెలా దూసుకువచ్చేది రాధ నోటినుండి. మామూలు విషయాలేకాదు మనసూర్తిగా సుతిమెత్తగా చెప్పదలు చుకున్నది సహితం భర్తను చూడగానే బాకులరూపంలో విసరడం రాధ స్వభావం అయిపోయింది. భార్య అనే వ్యక్తి కంతటి దూకుడు పనికిరాదని, భర్త చేసినది ఎటువంటిదైనా భరించవలసినదేనని అనుకునే భాస్కరం రాధపట్ల పూర్తిగా నిరసనభావం ఏర్పరుచుకున్నాడు. బలవంతంగా ఒక కప్పుక్రింద బ్రతుకు ఈడుస్తున్నట్లు సంచరించేవాడు.

అతనికీ ఆమెకు కూడా మధ్యన భగవత్ప్రసాదంలా సంతానం ఉండబట్టి రోజులలా దొర్లిపోతున్నాయి. ఆ బంధమే లేకుంటే ఆ ఇల్లు ఇంకెలా ఉండేదో మరి! అంటీఅంటనట్లుండే ఆ దంపతులు కూడా ఆ పిల్లల్ని మాత్రం ఏ లోటూ లేకుండా రూపొందించడం లో ఇద్దరికిద్దరు బాగా శ్రద్ధ చూపించేవారు. అది ఆ పసివాళ్ళు మరిచిపోలేదు. తండ్రిని నిరసించినట్లు ఏమాత్రం మాట జారినా రాధ అప్రమత్తంగా వాళ్లను శిక్షించేది. భాస్కరం కూడా పిల్లలముందు తల్లిని నిర్లక్ష్యం చేసి వారికి ఏమాత్రం అలుసూ ఇచ్చేవాడుకాదు. అందుకనే పిల్లలిద్దరు కూడా తల్లిదండ్రులంటే సమానమైన చనువు, భయభక్తులు కూడా కలిగిఉన్నారు. అయితే జీవితప్రారంభంనుండి రాధ జీవితగమనం మాత్రం వక్రగతిలో సాగింది.


పిల్లలకు ఊహ తెలుస్తున్నసమయాన భాస్కరం రాధను ఉద్యోగినిగా తయారుచేశాడు. అందులోని అతడి అంతరార్థం ఏమిటో తెలియని రాధ ఆలోచనలు పరిపరివిధాల పోయాయి. ఏదిఏమైనా తనకుతాను స్వశక్తితో బ్రతకడం తప్పనిసరి అయింది. "ఈ బరువుబాధ్యతలు నేను మోయ్యలేను బాబూ!" అన్నప్పుడల్లా 'అయితే నేరుగా పుట్టింటికి దయచెయ్యి' అనే భర్త పలుకులు ములుకులయ్యేవి. కష్టపడితే తప్ప తనకు స్థానం లేదన్నమాట! రాధ నవ నాడులూ అలాంటి మాటలతో కుంగిపోయాయి. జీవితగమనం యంత్రసదృశంగా మారిపోయింది. ఎవరిదారిన వారు పొట్టకోసం వెళ్లడం, తిరిగి గూడు చేరుకుని ఉన్నది తినడం, పిల్లల్ని చూసుకోవడం అన్నీ క్రమానుసారంగా జరిగిపోతున్నాయి. మనుష్యులమధ్య మమతలనేవి కరువైపోయాయి.


మరలలాంటి మనుష్యులమధ్య ఇనుపగోడలు అవలీలగా లేచిపోతాయి. కడివెడు పాలను విరిచేందుకు ఒక్క ఉప్పుగల్లు చాలు. మధుభాండంవంటి హృదయాల్ని ఒకరి స్వభావాలతో ఒకరు వ్రయ్యలు చేసుకున్నారు. రాధా, భాస్కరాలు. భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగస్థులైనప్పుడు వారికి అనుకూలంగా ఒకే చోట అవకాశాలు కల్పించాలనేవి ప్రభుత్వాదేశం. అది అమలుజరపడంలో ఎన్నో సాధకబాధకాలున్నా సాధించే భాస్కరం ఈసారి తనమానాన తాను బదిలీ అయి ఊరు చేరుకున్నాడు. రోజులు వారాలుగా, నెలలుగా మారుతున్నా రాధ అయోమయంగా ఎదురు చూడడంతో సరిపోయింది. ప్రతి రోజు ప్రభాతంలో చిగురించే ఆశ సంధ్యా సమయానికి అణగారిపోతూంది. నెలలకు నెలలే ఒంటరిగా, మగదక్షత లేకుండా పిల్లలలో, కన్నీటికి సహితం అవకాశం లేకుండా బ్రతుకు ఈడ్చే రాధలో బడబాగ్నితోపాటు అదోవిధమైన నిశ్చలత్వం పేరుకు పోసాగింది. పిల్లలిద్దరిచేత తరుచు ప్రశ్నించే ఉత్తరాలకు కనీసపు జవాబు కూడా నోచుకోలేదు. తనపట్ల అసహ్యానికి ఈ విధంగా పగ తీర్చుకుంటున్నాడు భర్త. కాని పిల్లలెవరు? తన రక్తంలో రక్తం. వారి పట్ల ఆయన కెందుకు ద్వేషం? రాధ ఆలోచించడం మానేసింది. అప్పటిదాకా కేవలం గాడిదబరువుగా మోస్తున్న ఉద్యోగపుబాధ్యత గురుతరబాధ్యతగా రూపొందింది. అందుకు సంబంధించిన అన్ని విషయాలు క్షుణ్ణంగా తెలుసుకుంటూ పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దటమొక్కటే ఆమె తన ధ్యేయంగా పెట్టుకుంది. ఆ లక్ష్యమే ఆమెను దీక్షగా ముందుకు నడిపిస్తూంది.

ఎవరి మానాన వాళ్లు బతికినా సంఘపు కళ్ళు మాత్రం ప్రతి ఒకరిపైనా నిఘా వేస్తూనే ఉంటాయి. 'మా విషయం నీ కెందు'కనే ధీమా సంఘజీవుల కుండకూడదసలు. అర్ధరాత్రి తలుపు చప్పుడుతో కొడుకును తోడుగా లేపి తలుపుతీసిన రాధ అవతలి వ్యక్తిని చూసి కొన్నిక్షణాలు నిశ్చేష్టురాలైంది. తండ్రిని అంతకాలం తరవాత చూసిన వేణు ఆత్రంగా "నాన్నా!" అనేసరికి తెప్పరిల్లింది రాధ. తెల్లవారే లోపుగా ఏ ఉపోద్ఘాతాలకూ తావియ్యకుండా అసలు సంగతి, అందుకుగాను రాధ చెయ్యవలసినది వివరించాడు భాస్కరం. ప్రాజ్ఞుడుకాబోతున్న కన్నకొడుకుగాని, ఆశగా అతడివైపే చూస్తున్న కూతురు విజయ దీనవదనం కాని భాస్కరం ధోరణికి అడ్డురాలేదు. కోడికూతవేళప్పుడు కన్నీటిపొరలమధ్య అతడు చూపిన కాగితంమీద సంతకం చేసింది రాధ. మరుక్షణంలో భాస్కరం లేచి నిలబడి "వేణూ, శ్రద్ధగా చదువుకో! విజయా, సెలవులకు వచ్చివెళ్ళు! రాధా, నా అవసరం ఏమీ ఉండదనే" అనుకుంటాను అంటూనే గడప దాటాడు. అక్కడ ఉన్న ముగ్గురూ అవాక్కులుగా ఉండిపోయారు. తల్లిలీరు చూసిన వేణు మాత్రం భుజంపట్టి కదుపుతూ "అమ్మా!" అన్నాడు. అప్పటి వరకూ పొరలమధ్య ఆగిన కన్నీరు కడలిచందాన పొర్లిపోయింది. కుప్పలా కూలిపోయిన రాధకు తానేమి చూసింది, చేసింది ఏదీ గుర్తులేదు. భర్త మాటలు మాత్రం కర్ణపుటాలవద్ద మారుమ్రోగుతున్నాయి.

వేసవి వచ్చింది ప్రతిసారిలాగే. "నాన్నారు రమ్మన్నారు కదమ్మా. అన్నయ్యా, నేనూ వెళ్లద్దా!" లోకం అంటే ఇంకా అర్థం చేసుకోలేని విజయ వెర్రిగా అడుగుతూంది తల్లిని. తన తోటివారందరిలో తానూ సెలవుల్లో ఊళ్లు చూడాలనే పసితనపుటాలోచనతే గాని మరే ధ్యాసలేదాపిల్ల మనస్సులో. మానని గాయాన్ని సహితం రూపుమాపేందుకు ప్రయత్నిస్తున్న రాధ తన కలవరపాటు కప్పిపుచ్చుకుందుకు సతమతమయింది. హోకీబాట్ ఊపుకుంటూ వచ్చిన, వేణు ఆ ఇద్దర్నీ చూసి "ఏమిటే!" అన్నట్లు చూశాడు చెల్లెలువైపు. తన్నే సమర్థిస్తాడనుకున్న విజయ "మనిద్దరం నాన్నారిఊరు వెళదామా అన్నాయ్?" అంది ఆత్రంగా. "కావలిస్తే నువ్వు వెళ్లిరా!" విసురుగా అనేసి వెళ్ళిపోయిన

అనన్య సామాన్య
ప్రచారంగల
తెలుగు వారపత్రిక
ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక





కాఫీ వేళ
ఔను! స్టేన్స్ ప్యూర్ కాఫీ మాత్రమే!




ఫలహారసమయంలో ఒక కప్పు స్టేన్స్ ప్యూర్ కాఫీ త్రాగండి. రోజంతా ఉత్సాహంగా వుండి చక్కగా ఆలోచించగలుగుతారు. అతి నిక్కార్సుగా వుండేందుకు రోస్టుచేసి, బ్లెండ్ చేయబడింది.

లభ్యమయ్యే రకాలు:
రెడ్ లేబుల్ (ప్రీమియమ్ క్వాలిటి) ఆరోగ్య సూత్రాల ప్రకారం తయారుచేయబడింది.
నికరమైన తూకం 400 గ్రాములు, 1 కిలోగ్రాము, 2 కిలోగ్రాములు, మరియు 9 కిలోగ్రాములు.
బ్రౌన్ లేబుల్ (ఆదాయకరమైనది) ఆరోగ్య సూత్రాల ప్రకారం ప్యాక్ చేయబడింది.
నికరమైన తూకం 400 గ్రాములు, 1 కిలోగ్రాము, 2 కిలోగ్రాము మరియు 9 కిలోగ్రాములు మరియూ సెల్లోఫేన్ సంచులలో 50, 100 గ్రాములు.

Stanes
స్టేన్స్
ఏరి ఏరి తయారుచేసిన అచ్చమైన కాఫీ

ది యునైటెడ్ కాఫీసప్లయ్ కంపెనీ లిమిటెడ్,
టి. స్టేన్స్ అండ్ కంపెనీ లిమిటెడ్ వారి సబ్సిడియరీ సంస్థ
కోయంబుత్తూరు, దక్షిణ ఇండియా
వంద సంవత్సరాలకు పైగా కాఫీపొడి తయారు చేస్తున్నారు.

పెద్ద హోల్‌సేలర్సు: తూర్పు ఆంధ్ర: మెస్సర్స్. కరణం హనుమంతరావు అండ్ సన్స్, ఈశ్వర్ నివాస్, తిరువెంగళరావు వీధి, గాంధీనగర్, కాకినాడ * పశ్చిమగోదావరి జిల్లా: మెస్సర్స్. శ్రీపాద నరసింహం బ్రదర్స్, జనరల్ మర్చంట్స్, ఏలూరు * హైదరాబాద్ సిటీ: మెస్సర్స్ కె. ఆర్. ఏజన్సీ, ట్రూప్ బజార్, జాంబాగ్, హైదరాబాద్.

వేణువైపు వింతగా చూస్తూండిపోయింది. రాధ, విజయ అయోమయంగా దీనంగా చూచిన చూపుతో ఆ మాతృహృదయం కరిగిపోయింది. అవునుమరి! తను దూరమయింది వాలక పసివాళ్ళనెందుకు పితృవాత్సల్యంనుండి దూరం చెయ్యాలి? ఆ రక్తంతో రక్తం అయిన పిల్లలు తమ హక్కు నెందుకు కోల్పోవాలి? అందునా విజయ అంటే భర్తకెంత ప్రాణమో తనకు బాగా తెలుసు. దాన్ని ఏమాత్రం కనుకున్నా తనపట్ల నిరసన చూపడమేననుకుని రోజులకు రోజులే మాటలు మానేవారు.

అసలే మనసులు విరిగిన మనుష్యుల మధ్య రోజులు మరీ భారంగా గడిచేవి. అదంతా విజయమీద భర్తకున్న ప్రత్యేకాభిమానంవల్లనే జరిగేది. ఎంతయినా కన్నతండ్రిని ఆ పసిది చూడాలనుకోవడంలో వింతేముంది? ఊహ తెలిసినవాడు గనుక వేణులో తండ్రి ప్రవర్తనపట్ల నిరసన ఏర్పడింది. తల్లిలోని బడబాగ్నిని కొంతలో కొంత అర్థం చేసుకుంటున్నాడు. విజయవయస్సు ఇంకా అంతకు పెరగలేదు. ఆలోచనలు ఆపి "రేపుపొద్దునే వెళుదువుగానిలే విజ్జీ!" అన్న రాధమాటలు చప్పట్లు కొడుతూ తిరిగి సంబరపడి పోయింది విజయ. "పిచ్చితల్లీ!" అంటూ విజయను దగ్గరికి తీసుకుని కాస్సేపలా ఉండిపోయింది మోడువారిన రాధ.

"నాన్నగారూ, పిన్ని నన్నిక్కడే చదువుకో మంటున్నారమ్మా! పిన్ని ఎంత మంచిదనుకున్నావ్. పిన్ని నీలా ఆఫీసుకి వెళ్ళదు. ఎప్పుడూ ఇంట్లోనే ఉంటుంది. చక్కగా నెమ్మదిగా నా జడవేసి పెడుతుంది. కొన్నాళ్ళకు నాకు తమ్ముడుగానీ, చెల్లాయిగానీ పుడతారట. ఆదివారం, ఆదివారం నాన్న పిన్నినీ, నన్నూ సినిమాకు తీసుకువెళతారు చక్కగా. నా కిక్కడే బావుందమ్మా!" "భగవాన్ నా పిల్లల్ని కూడా నాకు దూరం చేస్తున్నావా! నేనంతటి పాపినా!" విజయ అమాయకంగా వ్రాసిన ఉత్తరం పూర్తిచెయ్యకుండానే కుమిలిపోయింది రాధ.

"మనిద్దరి స్వభావాలూ కలవవు రాధా. మనసులు విరిగిన మనం ఇట్లా బ్రతుకంతా గడపడం కష్టం. మనం ఎవరిదారిన వాళ్ళం ప్రయాణం చెయ్యడమే మంచిది. నీ ఇష్టం నీది. కాని నేను నా జీవితసుఖాల్ని చేతులారా ధ్వంసం చేసుకోదలుచుకోలేదు. వేరే నాకు తగిన యువతిని పెళ్ళి చేసుకుంటున్నాను. కానీ ఇష్టానిష్టాలతో నాకేమీ ప్రమేయం లేకున్నా నా వివాహానికి నీకేమీ అభ్యంతరం లేదని నీచేత వ్రాయించుకోవలసి వచ్చినందుకు సిగ్గుగా ఉంది. అయినా తప్పటంలేదు. నిర్మొహమాటంగా చెప్పడం నా స్వభావం. ఈ కాగితాలమీద సంతకం చేసి ఇచ్చావంటే నా దారిన నేను పోతాను. నీకే బాధా ఉండదు." సంవత్సరం క్రితం అర్ధరాత్రివాడు భర్త చెప్పిన మాటలతో నిర్విణ్ణురాలై ఆయన చూపిన కాగితంపై సంతకం చెయ్యడం కళ్ళముందుకదలాడింది రాధకు. 'ఆఖరికి భగవంతుడు కూడా తన్ను హింసించ బూనుకున్నాడా! కని పెంచిన నానుండి నా బిడ్డనే వేరుచెయ్య సమకట్టాడా!' రాధ నిశ్శబ్దంగా రోదించి తన్నుతాను ఓదార్చుకుంది. అంతే. విజయ మరి ఎన్నడు అమ్మకుగాని, అన్నయ్యకుగాని ఒక్కముక్క వ్రాయలేదు.

చిరుమొలక దేముంది? పుట్టిన చోటునుండి జాగ్రత్తగా పెరికి మరొకచోట నాటి సంరక్షిస్తే చక్కగా నాటుకుంటుంది. పసివారి మనసులూ అంతేనని నిరూపించింది విజయ.

ఎవరికోసమూ ఆగని కాలగమనంలో వసంతాలు, గ్రీష్మాలు, వర్షఋతువులు, శిశిరాలు క్రమానుసారంగా కదలిపోతూంటే రాధ మాత్రం మోడువారి శశిరంలోని అకురాలిన మోడులానే ఉండిపోయింది నిర్వికారంగా.

"అమ్మా, నీవీరోజు రాకపోతే నేనసలు ఉత్సవానికి వెళ్లనే వెళ్లను."

"ఏమిట్రా వేణూ, నీ పిచ్చి! నేను వచ్చి చూస్తేనే నాకు గౌరవమా! నీ వింతటివాడివై కాలేజీకి ఫస్టుగా వచ్చి ప్రైజులందుకుంటూంటే చూడకపోతేమాత్రం నా కానందం కాదూ! అంతమంది పెద్దల్లో నేనెందుకు చెప్పు! నన్నిట్లా గోప్యంగా ఉండనీ నాన్నా!" నువ్వులూ, మాకలూ కలిపిన చందాన నగం నెరసిన వెంట్రుకలతో ముదిమికన్నా మదిలో నిండిన కలతలవల్ల వడిలి వాడిపోయినా గాంభీర్యం చెడని తల్లిరూపం వేణును కదిలించేసింది. ఒక్కసారిగా తల్లిఒడిలో తల దూర్చి "అమ్మా!" అంటూ బావురుమన్నాడు. "నీ బాధ నాకు తెలుసమ్మా! ఇన్నేళ్ళుగా నీవు గడిపిన నిర్లిప్త జీవితం నా కెన్నో అగాధాల్ని తెలిపిందమ్మా! నీ సుశిక్షణలో మానవుణ్ణిగా తయారయ్యానమ్మా. మమత, మానవత్వంనిండిన మనిషిగా నన్ను తీర్చిదిద్దిన నీ గుండెల్లోని మంటలు ఎవరికీ కనిపించవు. నిన్నిక బాధించనమ్మా!" అంటూ త్వరత్వరగా దుస్తులు వేసుకుని వెళ్లిపోయాడు వేణు.

కాలేజీఆవరణంతా చప్పట్లతో మారుమ్రోగుతూండగా స్టేజీపైకి వచ్చి ఓ క్షణం తలఎత్తి చూసిన వేణు గతుక్కుమన్నాడు. మరుక్షణంలోనే గంభీరంగా ప్రైజు అందుకుని అందించిన డెప్యూటీకలెక్టరుగారి శ్రీమతికీ, అధ్యక్షస్థానంలో ఉన్న డెప్యూటీకలెక్టరుకు నమస్కరించి గిరుక్కున వెనుదిరిగాడు. ఆ తరవాత వరసగా ఆరేడు బహుమతులు అందుకున్నాడు. ప్రతిసారీ డెప్యూటీ కలెక్టరుగారి నిశితదృష్టిని ఎదుర్కొంటూనే ఉన్నాడు వేణు. ఆఖరుసారి వెనుదిరిగిన వేణు శ్రీమతివైపు వంగి "రాధకొడుకు" అని డెప్యూటీ కలెక్టరన్న మాటలు స్పష్టంగా విన్నాడు. "నిజం! రాధ కొడుకునే! కనకనే మనిషిలా తయారయ్యాను. నీ రక్తం పంచుకుపుట్టినా నా తల్లి రాధ పెంపకంలో నీలోని కాలుష్యము కరినత్వము పోగొట్టుకుని నిర్మలుడను, నిజాయితీపరుడను, సచ్చరిత్రుడను అయ్యాను." సగర్వంగా తన్ను తానభినందించుకుంటూ తన ఈ ఔన్నత్యానికి కారణభూతురాలైన అమ్మను స్మరించుకుంటూ ఇల్లుచేరాడు వేణు. టేబుల్‌లైట్ వెలుగులో కాంపోజిషన్ పుస్తకాలు దిద్దుకుంటూంది రాధ. స్టేజిపై పక్కపక్కన కుర్చీలలో కూర్చుని ఉన్న డెప్యూటీ కలెక్టరుగారు వారి సతీమణి గుర్తుకు వచ్చారు. 'ఎక్కడ ఉండవలిసినదాన వెక్కడ ఉన్నావమ్మా!' వేణు గుండె గొంతుకలో కొట్టుమిట్టాడింది. 'వద్దు! అమ్మకు ఏదీ చెప్పను. చెప్పి ఎందుకామెను వేదనపాలు చెయ్యడం? ఆమె జీవితమలా నిత్యశిశిరంలా జరిగిపోనీ!' అనుకుంటూ లేనిఉత్సాహంతో "అమ్మా!" అంటూ లోనికి వెళ్లాడు. ★









పుష్పము మీ అదృష్టం చెప్పగలదు

మీ భవిష్యత్తులో ఏమి జరుగబోవుచున్నది, మీ సరియైన చర్యను గురించిన్ని మీరు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన మీకు ఇష్టమగు ఒక పుష్పము పేరున్నూ, మీరు వ్రాయుతేదీ, వేళ వివరములున్నూ, మీ సరియైన చిరునామాను, వెంటనే వ్రాసి పంపండి. జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, మీరు కార్డు వ్రాసిన తేదీ లగాయతు 12 మాసములలోను మీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవిత మార్గము ఏ వ్యవహారములో మీకు జయము కలుగునో ఉద్యోగం విషయంలో మంచి చెడ్డలు, మార్పులు, ఆరోగ్య విషయము, పరదేశ గమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీ సుఖము, సంతానము, విధినిక్షేపములు, లాటరీ, అకస్మాత్ ద్రవ్యలాభము మొదలగు వానిని గురించి స్పష్టముగా మానవారీగా వ్రాసి రు. 1–25 పైలకుమాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. చార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేవైనా ఉన్నయెడల శాంతిచేయు విధానము కూడా తెలుపగలము. వివరములు మా ఫూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా లేనియెడల పైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించండి. అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

PT. DEV DUTT SHASTRI, RAJ JYOTSHI (A.P.W.)
POST BOX NO. 86, JULLUNDUR CITY.

సువాసనగల చార్మిస్ స్నో రాసుకొంటే ఇప్పుడు
మనోహరమైన ముఖవర్చస్సు కలుగుతుంది!




చార్మిస్ స్నో మీ ముఖ వర్చస్సుకు మెరుగులు దిద్దుతుంది. మీ ముఖము మృదువుగా, నవనవలాడుతూ ఉంటుంది. దాని మోహన సువాసనకు మీరు సంతోషపడతారు!

ఇప్పుడు కొత్త నీలి మరియు బంగారు రంగు ప్యాకులో లభిస్తోంది

చార్మిస్ స్నో— మీ అందమును పెంపొందిస్తుంది, ముఖవర్చస్సును రక్షిస్తుంది